క్లుప్తంగా

విఠలేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: మహారాష్ట్రలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. సీఎం కేసీఆర్ వెంట మహారాష్ట్ర పర్యటనకు వెళ్లిన షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విఠలేశ్వర స్వామి, రుక్మిణీ దేవి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, దేవేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు ట్యాబ్‌ల అందజేత



హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈఓ మనోహర్

కేశంపేట: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలకు ఎంఈఓ మనోహర్ ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల హాజరుతో పాటుగా మధ్యాహ్న భోజన వివరాలను ప్రతీరోజు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డిగూడ, కేశంపేట జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యగౌడ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

కేశంపేట: వానాకాలంలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి లాభసాటి పంటల సాగు వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో వేములనర్వ, అల్వాల రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లయ్య, సత్తయ్య, రాములు, భీమయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వందశాతం సబ్సిడీపై విత్తనాలు

మొయినాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మొయినాబాద్ ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మొయినాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ద్వారా ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం పథకం కింద రైతులకు వంద శాతం సబ్సిడీపై కంది విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు అందజేస్తూ సీఎం కేసీఆర్ రైతులకు అండగా ఉంటున్నారన్నారు. ప్రభు త్వం ఇచ్చే సబ్సిడీలు, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని.. వ్యవసాయంలో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్, కాశీంబౌలి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్‌పై చర్యలకు డిమాండ్



సీజ్ చేసిన పుస్తకాలు, యూనిఫాం

షాబాద్: బుక్స్, యూనిఫాం విక్రయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు తనిఖీలు చేస్తుండగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన నాగర్‌గూడ అక్షర టాలెంట్ స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారు పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. జీఓ నంబర్ 1 విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థలలో బుక్స్, యూనిఫాం విక్రయించకూడదన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారులు వచ్చి బుక్స్, యూనిఫాం సీజ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థలను తనిఖీ చేసి, ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు సాయి, గణేష్, మనీ, సాయిరాం, విగ్నేష్ తదితరులున్నారు.



షాబాద్: తాళ్లపల్లిలో విత్తనాలు వేసే పనుల్లో రైతు కూలీలు

తొలకరి పులకరింత

పల్లెల్లో మొదలైన సేద్యపు పండుగ

పుడమి ఒడిలో తొలకరి జల్లుల రాకతో పల్లెల్లో అరకలు కదులుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాల్లో రైతులు, రైతు కూలీల కోలాహలం కనిపిస్తోంది. సేద్యానికి సిద్ధమైన అన్నదాతలు నేల పదును చూసి దుక్కులు చేస్తున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు వేస్తున్నారు. మంగళవారం ఎక్కడ చూసినా విత్తనాలు వేస్తూ అన్నదాతలు బిజీగా కనిపించారు. – చేవెళ్ల, షాద్‌నగర్ జోన్‌బృందం



కొందుర్గులో విత్తనాలు వేస్తున్న రైతులు

పంట పెట్టుబడికి ‘రైతుబంధు’

ప్రభుత్వం రైతుబంధు సాయాన్ని రైతుల ఖాతాల్లో జమచేయడం ప్రారంభించింది. పెట్టుబడి సాయం ఖాతాల్లో పడిన వెంటనే రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఊపందుకున్న సాగు పనులు
- నియోజకవర్గ పరిధిలో 83 వేల మంది రైతున్నలకు లబ్ధి
- సుమారు రూ.76 కోట్లపైగా సాయం
- నేరుగా రైతుల ఖాతాల్లోనే జమవుతున్న నగదు



విత్తనాలు వేసేందుకు దుక్కి దున్నుతున్న రైతు

షాద్‌నగర్: ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. రైతుబంధు పథకంలో భాగంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. ఎప్పటిలాగే ఈ సీజన్‌లోనూ సోమవారం మొదట ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు సాయం అందించారు. నియోజకవర్గంలోని 83వేల మందికి పైగా రైతులకు సుమారు రూ.76.30కోట్ల రూపాయలను ప్రభుత్వం అందజేయనుంది.

నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి

ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.5వేల పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటగా ఎకరం లోపు ఉన్న వారికి జమ చేసి విడతల వారీగా రైతులందరికి పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో అధికారులు పెట్టుబడి సాయం పొందే రైతులను గుర్తించిన అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించారు.

జూలై 3వరకు అవకాశం

కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు, గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు పొంది ఇప్పటి వరకు అందించని రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించి వివరాలు అందించాలని వ్యవసాయాధికారులు సూచించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను అందించాలని అధికారులు కోరుతున్నారు. అయితే జూలై 3లోపు వివరాలు అందజేయాలని అధికారులు వెల్లడిస్తున్నారు.

పెట్టుబడి సాయం వివరాలు

మండలం	రైతులు	ప్రభుత్వ సాయం
ఫరూఖ్‌నగర్	25,473	రూ.22.69కోట్లు
కొత్తూరు	8,890	రూ.6.40కోట్లు
కేశంపేట	19,871	రూ.22కోట్లు
కొందుర్గు	12,500	రూ.11.50కోట్లు
చౌదరిగూడ	8,772	రూ.5.50కోట్లు
నందిగామ	7,889	రూ.8.19కోట్లు

అర్హుల జాబితా అందించాం



రైతుబంధు పథకం వానాకాలం పంట సహాయానికి సంబంధించి అర్హుల జాబితాను ప్రభుత్వానికి అందజేశాం. రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సహాయం డబ్బులు ప్రభుత్వం జమ చేస్తోంది. గతంలో పట్టా పాసుపుస్తకాలు పొంది పంట సాయం పొందని వారు స్థానిక వ్యవసాయ అధికారులను కలిసి వివరాలు అందించాలి.

– భిక్షపతి, ఏడీఏ, షాద్‌నగర్

అన్నదాతలకు ఆర్థిక తోడ్పాటు



అన్నదాతలకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రైతుబంధు పథకం కింద అన్నదాతలకు వానాకాలం పెట్టుబడి సాయం అందజేస్తుంది.

– అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడలో బూత్ కమిటీ అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఎన్నో హామీలిచ్చి మరిచారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. అధికార పార్టీ నేతలంతా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్రం పథకాలను రూపొందించి అమలు చేస్తోంద అన్నారు. ప్రధానమంత్రి నిర్వహించిన మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్ వర్చువల్ కార్యక్రమాన్ని నేతలు టీవీల్లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె బాబయ్య, లష్కర్ నాయక్, వెంకటేశ్‌యాదవ్, హన్మంతు, శంకర్ నాయక్, సాయిలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనతోనే అభివృద్ధి

చేవెళ్ల: మోదీ పాలనతో దేశాభివృద్ధి జరుగుతోందని బీజేపీ నియోజకవర్గ నాయకులు కంజర్ల ప్రకాశ్, విర్రి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలూరులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశ్, విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా భూపాల్‌లో ప్రధాని మోదీ నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఎల్‌ఈడీలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాకార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఉమాశంకర్‌రెడ్డి, ఆలూరు శక్తి కేంద్రం ఇన్‌చార్జి కృష్ణ, బూత్ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: కొండన్నగూడలో బీజేపీ నేతల ప్రచారం



చేవెళ్ల: ఆలూరులో..

వసతుల కల్పనకు సహకారం

- త్వరలోనే పనులు ప్రారంభిస్తాం
- కన్సర్న్ ఇండియా, అమేజాన్ సంస్థల ప్రతినిధుల వెల్లడి

నందిగామ: అంగన్‌వాడీ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన కన్సర్న్ ఇండియా, అమేజాన్ సంస్థల సేవలు అభినందనీయమని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని చేగూరు అంగన్వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ లత ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేపట్టడంతో పాటు, కనీస సౌకర్యాలు కల్పించేందుకు అమేజాన్, కన్సర్న్ ఇండియా సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా వీరు సాయం అందజేస్తున్నారని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలోనే పనులు రారంభిస్తామని వివరించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్, గ్రామస్తులు శ్రీశైలం, రవితేజ, రాజు, నరేందర్, రమేశ్, విజయ్ భాస్కర్, మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రకళ, అమృత తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థికసాయం

శంకర్‌పల్లి: మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్ రాజు అకాల మరణంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. అతని కుమారుడి పేరుపై రూ.2లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మంగళవారం ఎంఈఓ అక్బర్ చేతుల మీదుగా బాండ్ అందజేశారు. ఈ సదంర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉపాధ్యాయులు మందుకు రావడం అభినందనీయమన్నారు. ఎమ్మార్సీలో అటెండర్‌గా పని చేస్తున్న రాజు అందరితో కలివిడిగా ఉండేవాడని.. ఉపాధ్యాయులు పని నిమిత్తం కార్యాలయానికి వస్తే అన్ని తానై వారి పనులు చేసే వాడని గుర్తు చేశారు. అందుకే రాజుపై ఉపాధ్యాయులకు ప్రత్యేక అభిమానం ఉండి వారి కుటుంబానికి అండగా నిలిచారన్నారు. భవిష్యత్‌లోనూ రాజు కుమారుడి చదవుకు సహకరిస్తామని ఉపాధ్యాయ జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఉపాధ్యాయులు నరహరి, జయసింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, తాహిర్ అలీ, రాజశేఖర్, శివకుమార్, శ్రీనివాస్, పాషా, ఆశీర్వాదం, యాదయ్య, బాల్‌రాజ్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వనజ, పద్మజ, నాగేశ్, రాములు తదితరులున్నారు.



ఎమ్మార్సీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి బాండ్ అందజేస్తున్న ఎంఈఓ అక్బర్, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

వసతులు లేక గిరిజనుల ఇబ్బందులు

గిరిజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: తండాల్లో కనీస వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చించోడ్ పంచాయతీ గౌరీకుంట తండాలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. మెయిన్ రోడ్డు నుంచి గౌరీకుంట తండాకు ప్రధాన రోడ్డు లేదని.. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తండాలకు రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసినా నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ నాయక్, రమేశ్ నాయక్, సంజు, సంతోశ్, బాబు నాయక్, శంకర్ నాయక్, నెహ్రూ నాయక్, శంకర్ నాయక్, దాస్య నాయక్, బాబా, గిరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకుంటేనే విజయం

ఇన్‌చార్జి కల్నల్ విజయ్‌బలరాం

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంచుకుంటేనే ఉన్నతంగా రాణిస్తారని ఆంధ్రప్రదేశ్ డిఫెన్స్ కంపెనీ ఇన్‌చార్జి కల్నల్ విజయ్‌బలరాం అన్నారు. మంగళవారం గండిపేట పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలోఇన్వెస్టిచర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌బలరాం విద్యార్థులకు బాధ్యతలు వివరించి అర్హులైన వారికి నాయకత్వ బాధత్యలు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో అవగాహన పెంచుకుంటేనే బాధ్యతలు తెలుసుకుంటారన్నారు. విద్యార్థుల ఉన్నతికి పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాల చైర్మన్‌ఖ కొమురయ్య, సీఈఓ యశ్వి, ప్రిన్సిపాల్ హేమ మాడభూషి ఆయనకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

పోటీలతో ప్రతిభ మెరుగుపడుతుంది



శంకర్‌పల్లి: విద్యార్థులకు బహుమతులు అంజేస్తున్న బ్యాంక్ మేనేజర్లు, ఉపాధ్యాయులు



చేవెళ్ల: ద్వితీయ బహుమతి సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు భార్గవి, వర్షిత

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి

చేవెళ్ల: పోటీల్లో పాల్గొంటేనే విద్యార్థుల ప్రతిభ మెరుగు పడుతోందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో బ్లాక్ స్థాయిలో ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం ద్వారా మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చేవెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు కె.భార్గవి, వర్షిత రెండో స్థానంలో నిలిచి రూ.4వేల క్యాష్ ప్రైజ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఆంజనేయులు, ఉపాధ్యాయురాలు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది

శంకర్‌పల్లి: క్విజ్ పోటీలతో విద్యార్థుల జ్ఞాపకశక్తి పెరుగుతుందని బ్యాంక్ మేనేజర్లు రాంచంద్రయ్య, లక్ష్మీనారాయణ, సోమలింగం అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థలకు పోటీలు నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత, సమీకృత అభివృద్ధి అనే అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో టంగటూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు టి.శ్రావణి, ఎం.రుచితకు ప్రథమ బహుమతి, శంకర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ విద్యార్థులు వి.వంశీ, గణేశ్ రెండవ బహుమతి, జెడ్పీహెచ్‌ఎస్ జనవాడ విద్యార్థులు ఎస్.సాయిరాం, రామారావులు తృతీయ బహుమతి సాధించారని వివరించారు. వారికి బహుమతులు, సర్టిఫికెట్లను ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శ్రీను, జయసింహారెడ్డి, విద్యాకర్, స్వర్ణలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం చేసేందుకే ఆరోపణలు

సంజీవని ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్

కొత్తూరు: తమ సంస్థకు నష్టం కలిగించేందుకే ఆరోపణలు చేస్తున్నారని సంజీవని ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ పత్తిపాటి శ్రీధర్ అన్నారు. పత్రికలు, టీవీల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని కొట్టి పడేశారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ శివారులో తాను కొనుగోలు చేసిన సర్వే నంబర్ 97 పొలం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో తిమ్మాపూర్ శివారులోని సర్వే నంబర్ 97/ఆలో 3 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశామన్నారు. అనంతరం వెంచర్ ఏర్పాటుకు హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేసుకోగా ఎల్‌పీ నంబర్ కేటాయించారని వివరించారు. తమకు సమాచారం లేకుండానే మా పొలాన్ని మరో వ్యక్తి పేరుపైకి బదలాయించడంతో విషయా న్ని తహసీల్దార్ చెప్పగా కలెక్టర్ కార్యాలయంలో యూఆర్‌బీ ద్వారా బదలాయించినట్లు చె ప్పారు. వెంటనే పోలీసు, కలెక్టర్ కార్యాలయా ల్లో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. తమ సంస్థపై ఆరోపణలు చేస్తున్న వ్యక్తులను న్యాయ బద్ధంగా ఎదుర్కొంటామన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఆర్‌సీహెచ్ పాఠశాల 1994–95 బ్యాచ్ విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాలలో 28 ఏళ్ల క్రితం 10వ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1994–95లో పదోతరగతి పూర్తిచేసిన వారు ఓ ఫాంహౌస్‌లో కలుసుకుని గత స్మృతులను నెమరేసుకున్నారు. వారికి పాఠాలు బోధించిన గురువులు పద్మావతి, రత్న, ఇస్రాయిల్, సామెల్‌ను సన్మానించారు.